కోహ్లీ (88)

గిల్ (92)

శ్రేయస్ (82)

ఆహా ఏమా బ్యాటింగ్.. ఏమా బౌలింగ్! ఇది కదా సమిష్టి ప్రదర్శన అంటే.. ఇది కదా సంపూర్ణ ఆధిపత్యం అంటే! ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ జయకేతనం ఎగరేసిన టీమ్‌ఇండియా.. తాజా ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరిన తొలి జట్టుగా నిలిచింది.

బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ నిలకడకు శ్రేయస్ అయ్యర్ మెరుపులు తోడవడంతో టీమ్‌ఇండియా కొండంత స్కోరు చేస్తే.. బౌలింగ్‌లో మన పేసర్లు వాంఖడేను వాకాగా మారుస్తూ నిప్పులు కురిపించారు. షమీ, సిరాజ్ ధాటికి పరుగులు చేయడం పక్కన పెట్టి అసలు క్రీజులో ఎలా నిల్చోవాలో కూడా తెలియక తెల్లమొఖాలేసిన లంకేయులు.. ఆరో పరాజయంతో నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించారు!

టీమ్‌ఇండియా ఏడో విజయం

సాత్ సితారా సెమీస్ హమారా

సెమీఫైనల్లో రోహిత్ సేన • 302 పరుగులతో లంక చిత్తు

మెరిసిన గిల్, కోహ్లీ, శ్రేయస్ • నిప్పులు చెరిగిన షమీ, సిరాజ్

ముంబై: వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా అప్రతిహత విజయాల పరంపర కొనసాగుతున్నది. ప్రత్యర్థితో సంబంధం లేకుండా దూసుకెళ్తున్న రోహిత్ సేన స్వదేశంలో జరుగుతున్న మెగాటోర్నీలో వరుసగా ఏడో విజయం సాధించింది. గురువారం ముంబై వాంఖడే స్టేడియంలో జరిగిన పూర్తి ఏకపక్ష పోరులో భారత్ 302 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించిన రోహిత్ సేన 14 పాయింట్లతో అందరికంటే ముందు సెమీఫైనల్లో అడుగుపెట్టింది. అదే సమయంలో ఏడు మ్యాచ్‌ల్లో ఐదు పరాజయాలతో శ్రీలంక సెమీస్ రేసుకు దూరమైంది. మొదట భారత్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. గిల్ (92 బంతుల్లో 92; 11 ఫోర్లు, 2 సిక్సర్లు), కోహ్లీ (94 బంతుల్లో 88; 11 ఫోర్లు), శ్రేయస్ (56 బంతుల్లో 82; 3 ఫోర్లు, 6 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (4) విఫలం కాగా.. ఆఖర్లో రవీంద్ర జడేజా (24 బంతుల్లో 35; ఒక ఫోర్, ఒక సిక్సర్) విలువైన పరుగులు జోడించాడు. లంక బౌలర్లలో మధుషనక 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 19.4 ఓవర్లలో 55 పరుగులకు ఆలౌటైంది. కసున్ రజిత (14), తీక్షణ (12 నాటౌట్), మాథ్యూస్ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేయగా.. మిగిలిన వాళ్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అందులో ఐదుగురు డకౌట్ కావడం గమనార్హం. భారత బౌలర్లలో మహమ్మద్ షమీ 5, సిరాజ్ మూడు వికెట్లు పడగొట్టారు. లంక ప్లేయర్లకు నిద్రలేని రాత్రులు మిగిల్చిన షమీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో ఆదివారం దక్షిణాఫ్రికాతో తలపడనుంది.

కోహ్లీ గోల్డెన్ చాన్స్ మిస్

బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై టాస్ గెలిచిన శ్రీలంక కెప్టెన్ కుషాల్ మెండిస్ టీమ్‌ఇండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. సొంత మైదానంలో తొలి బంతికే బౌండ్రీ బాది ఖాతా తెరిచిన రోహిత్ రెండో బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో లంక సారథి ఆలోచన సరైందే అన్నట్లు అనిపించినా.. ఆ తర్వాత గిల్, కోహ్లీ ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. మంచి బంతులను గౌరవించిన ఈ జోడీ.. చెత్త బంతి పడితే చాలు దాన్ని బౌండ్రీకి తరలించారు. ఈ క్రమంలో లంక ఫీల్డర్ల తప్పిదాలు కూడా టీమ్‌ఇండియాకు కలిసొచ్చాయి. ఇన్నింగ్స్ ఆరంభంలోనే కోహ్లీ, గిల్ ఇచ్చిన సులువైన క్యాచ్‌లను వదిలేశారు. ఈ క్రమంలో మొదట విరాట్ 50 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసుకోగా.. కాసేపటికే గిల్ (55 బంతుల్లో) ఆ మార్క్ దాటాడు. ఇక అక్కడి నుంచి గేర్లు మార్చిన వీరిద్దరూ వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా గిల్ సిక్సర్లతో రెచ్చిపోయాడు. ఇక ఇద్దరి శతకాలు ఖాయమే అనుకుంటే.. మరోసారి మధుషనక దెబ్బకొట్టాడు. 30వ ఓవర్‌లో గిల్‌ను ఔట్ చేసిన అతడు.. తన తదుపరి ఓవర్‌లో కోహ్లీని బలి తీసుకున్నాడు. సచిన్ టెండూల్కర్ సమక్షంలో వన్డేల్లో మాస్టర్ అత్యధిక సెంచరీల (49) రికార్డును సమం చేయాలనుకున్న కోహ్లీ.. శతకానికి పన్నెండు పరుగుల దూరంలో నిష్క్రమించాడు. అయినా చివర్లో శ్రేయస్ చెలరేగడంతో భారత్ భారీ స్కోరు చేసింది.

సిరాజ్ (3/16)

షమీ (5/18)

1 ప్రపంచకప్‌లో భారత్ తరఫున అత్యధిక (45) వికెట్లు తీసిన బౌలర్‌గా షమీ రికార్డుల్లోకెక్కాడు. జహీర్ ఖాన్, జవగళ్ శ్రీనాథ్ (44) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

1 వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక (3) సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన బౌలర్‌గా స్టార్క్‌ను షమీ సమం చేశాడు. భారత్ తరఫున ఇదే అత్యధికం.

శ్రేయస్ సిక్సర్ల హోరు

జట్టులో చోటు సందిగ్ధంలో పడ్డ సమయంలో శ్రేయస్ అయ్యర్ బ్యాట్ నుంచి ఆణిముత్యంలాంటి ఇన్నింగ్స్ జాలువారింది. మంచి టచ్‌లో ఉన్న బ్యాటర్లు ఔటైన సమయంలో క్రీజులో అడుగుపెట్టిన శ్రేయస్.. వాంఖడేను ఉర్రూతలూగించాడు. ఫోర్ల కంటే సిక్సర్లు కొట్టడమే తేలిక అన్నట్లు లంకేయులను ఊచకోత కోశాడు. కేఎల్ రాహుల్ (21), సూర్యకుమార్ యాదవ్ (12) ఎక్కువ సేపు నిలువలేకపోయినా.. అందిన బంతిని అందినట్లు స్టాండ్స్‌లో పడేశాడు. కసున్ రజిత వేసిన 36వ ఓవర్‌లో అయ్యర్ కొట్టిన బంతి 106 మీటర్ల దూరం వెళ్లింది. తాజా వరల్డ్‌కప్‌లో ఇదే అతిపెద్ద సిక్స్ కావడం గమనార్హం. ఈ ఊపులో శ్రేయస్ సెంచరీ ఖాయం అనిపించినా.. మరో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో అతడు వికెట్ కోల్పోగా.. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆఖర్లో తన విలువ చాటుకున్నాడు.

1 వన్డే ప్రపంచకప్‌లో పరుగుల తేడా పరంగా భారత్‌కు ఇదే (302) అతిపెద్ద విజయం. ఓవరాల్‌గా రెండోది. ఈ ఏడాది త్రివేంద్రం వేదికగా లంకతో జరిగిన పోరులో టీమ్‌ఇండియా 317 పరుగుల తేడాతో గెలిచింది.

వన్డేల్లో భారత్ తరఫున అత్యధిక (4) సార్లు ఐదు వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా షమీ నిలిచాడు. జవగళ్ శ్రీనాథ్ (3)ను వెనక్కి నెట్టాడు.

ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సార్లు (8) వెయ్యి పరుగులు చేసిన ప్లేయర్‌గా విరాట్ కోహ్లీ రికార్డుల్లోకెక్కాడు. సచిన్ (7)ను అధిగమించాడు.

3 వన్డేల్లో శ్రీలంకకు ఇది (55) మూడో అత్యల్ప స్కోరు. 2012లో దక్షిణాఫ్రికా చేతిలో 43 పరుగులే చేసిన లంక.. ఇటీవల ఆసియాకప్ ఫైనల్లో టీమ్‌ఇండియా చేతిలో 50 పరుగులకు కుప్పకూలింది. వరల్డ్ కప్‌లో లంకకు ఇదే అత్యల్పం.

8 ప్రపంచకప్‌లో భారత్ సెమీస్ చేరడం ఇది ఎనిమిదోసారి.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 357/8 (గిల్ 92, కోహ్లీ 88; మధుషనక 5/80),
శ్రీలంక: 19.4 ఓవర్లలో 55 ఆలౌట్ (కసున్ రజిత 14; షమీ 5/18, సిరాజ్ 3/16).

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్ ✓	7	7	0	+2.10	14
దక్షిణాఫ్రికా	7	6	1	+2.29	12
ఆస్ట్రేలియా	6	4	2	+0.97	8
న్యూజిలాండ్	7	4	3	+0.48	8
పాకిస్థాన్	7	3	4	-0.02	6
అఫ్గానిస్థాన్	6	3	3	-0.71	6
శ్రీలంక	7	2	5	-1.16	4
నెదర్లాండ్స్	6	2	4	-1.27	4
బంగ్లాదేశ్	7	1	6	-1.44	2
ఇంగ్లండ్	6	1	5	-1.65	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

బాల్ బాల్ బచ్‌గయా!

దిన దిన గండం నూరేండ్ల ఆయుష్షు అన్నట్లు.. బంతిని టచ్ చేస్తే క్యాచ్.. వదిలేస్తే బౌల్డ్ ఇలా సాగింది శ్రీలంక ఇన్నింగ్స్! దేన్ని వదిలేయాలో దేన్ని ఆడాలో అని నిర్ణయించుకునేలోపే లంక ప్యాకప్ అయిపోయింది. కొండంత లక్ష్యఛేదనలో ఇన్నింగ్స్ తొలి బంతికే బుమ్రా వికెట్ల పతనానికి నాంది పలికితే.. ఆ తర్వాత సిరాజ్, షమీ రెచ్చిపోయారు. అసలైతే మన పేసర్ల ప్రతాపానికి రెచ్చిపోయారు అనడం చాలా చిన్న పదమే అవుతుంది! మెగాటోర్నీలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడనే విమర్శలు ఎదుర్కొంటున్న 'చార్మినార్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్.. తన తొలి బంతికే దిముత్ కరుణరత్నెను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. లంక ఓపెనర్ రివ్యూ తీసుకున్నా ఫలితం లేకపోయింది. ఇక అదే ఓవర్ ఐదో బంతికి సదీర సమరవిక్రమ స్లిప్‌లో దొరికిపోయాడు. అప్పటికే రెండు వికెట్లు పడి ఒత్తిడిలో ఉన్న లంకను.. కెప్టెన్ రోహిత్ మరింత ఒత్తిడిలోకి నెట్టాడు. ఇటు వైపు సిరాజ్ గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసురుతుంటే.. టెస్టు మ్యాచ్ తరహాలో ఏకంగా మూడు స్లిప్‌లు పెట్టాడు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనైన సమరవిక్రమ.. థర్డ్ స్లిప్ చేతికి చిక్కి భారంగా పెవిలియన్ బాట పట్టాడు. ఫలితంగా రెండు ఓవర్లు ముగిసే సరికి లంక బ్యాట్‌తో పరుగులేమీ చేయకుండానే మూడు వికెట్లు కోల్పోయింది. తన తదుపరి ఓవర్ తొలి బంతికి లంక కెప్టెన్ కుషాల్ మెండిస్‌ను సైతం సిరాజ్ బలిగొన్నాడు. హైదరాబాదీ చేతి నుంచి బుల్లెట్ వేగంతో వచ్చిన బంతి కుషాల్ ఆఫ్‌స్టంప్‌ను గిరాటేసింది. అసలు భారత బౌలర్లను ఎలా ఎదుర్కోవాలో తేల్చుకోలేక సతమతమవుతున్న లంకకు అభిమానుల హోరు మరింత ఇబ్బంది పెట్టింది. మైదానంలో ఉన్న పదకొండు మంది భారత ప్లేయర్లతో పాటు.. వేలాది మంది అభిమానులు ఒక్కో బంతికి అప్పీల్ చేస్తుంటే.. వాంఖడే మోతెక్కిపోయింది. ఆ తర్వాత వికెట్ల పతనానికి కాస్త బ్రేక్ పడగా.. ఈ టోర్నీలో ఆలస్యంగా తుది జట్టులో చోటు దక్కించుకున్న మహమ్మద్ షమీ తన విలువేంటో మరోసారి నిరూపించుకున్నాడు. న్యూజిలాండ్, ఇంగ్లండ్ బ్యాటర్లను చెడుగుడాడుకున్న షమీ ముందు లంక ప్లేయర్లు గల్లీ కుర్రాళ్లలా కనిపించారు. 10వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన షమీ వరుస బంతుల్లో అసలంక, హేమంతను ఔట్ చేశాడు. ఫలితంగా లంకేయుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లు అయింది. అప్పటి దాక సిరాజ్ ఒక్కడే సతాయిస్తున్నాడనుకుంటే.. అతడికి షమీ తోడవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. వీరిద్దరి చేతిలో నుంచి బంతి రావడం.. లంక బ్యాటర్లు వణికిపోవడం పరిపాటిగా మారింది. ఇటీవల ఆసియాకప్, అంతకుముందు వన్డే సిరీస్‌లో లంకను తన బౌలింగ్‌తో బెంబేలెత్తించిన సిరాజ్ ఈ సారి కూడా అదే జోష్ చూపాడు. షమీ వేసిన లెగ్‌సైడ్ బంతిని అనవసరంగా ఆడిన చమీర కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగగా.. ఏంజెలో మాథ్యూస్ క్లీన్ బౌల్డయ్యాడు. షమీ వేసిన ఇన్‌స్వింగర్‌కు లంక ఆల్‌రౌండర్ వికెట్లు చెల్లచెదురైన సీన్ చూసి తీరాల్సిందే! దీంతో 29 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయిన లంక వన్డే క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు రికార్డును చెరిపేస్తుందేమో అనిపించినా.. చివర్లో రజిత, తీక్షణ కాసిన్ని పరుగులు చేసి గండం గట్టెక్కించారు. ఈ మ్యాచ్‌లో లంకకు మిగిలిందంటూ ఏదైనా ఉందంటే అది బౌలింగ్‌లో మధుషనక ఐదు వికెట్లు పడగొట్టడం.. బ్యాటింగ్‌లో అత్యల్ప స్కోరును అధిగమించడం అంతే. అంత కుమించి మరేం లేదు!

- నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

వరుసగా మూడు మ్యాచ్‌ల్లో నాలుగుకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టడం షమీకి ఇది రెండోసారి. 2019 వన్డే ప్రపంచకప్‌లో వరుసగా 4/40, 4/16, 5/69 గణాంకాలు నమోదు చేసుకున్న షమీ.. ఇప్పుడు తాజాగా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 5/54, 4/22, 5/18 ప్రదర్శన కనబర్చాడు. ఇలా వరుసగా మూడు మ్యాచ్‌ల్లో నాలుగుకంటేఎక్కువ వికెట్లు మూడుసార్లు పడగొట్టిన వకార్ యూనిస్ అగ్రస్థానంలో ఉండగా.. షమీ రెండో ప్లేస్‌లో నిలిచాడు.

వ్రితి పతక జోరు

నేషనల్ గేమ్స్

వ్రితి అగర్వాల్

పనాజీ: గోవా వేదికగా జరుగుతున్న 37వ నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఇప్పటికే మూడు పతకాలు సొంతం చేసుకున్న వ్రితి తాజాగా మరో పతకాన్ని దక్కించుకుంది. గురువారం జరిగిన మహిళల 1500మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో బరిలోకి దిగిన వ్రితి 18:03:88సెకన్ల టైమింగ్‌తో రజతంతో మెరిసింది. భవ్య సచ్‌దేవ(17:40:80, ఢిల్లీ), శిరిణ్(18:18:21, కర్నాటక) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. టెన్నిస్ మహిళల సింగిల్స్‌లో శ్రీవల్లి రష్మిక 6-0, 6-1తో హర్షిణిపై విజయంతో క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.

చాలెంజర్ ట్రోఫీలో మనోళ్లు

• యువ క్రికెటర్లకు జగన్ అభినందన

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగనున్న అండర్-19 చాలెంజర్ ట్రోఫీకి హైదరాబాద్ క్రికెటర్లు ధీరజ్‌గౌడ్, మురుగన్ అశ్విన్, నిశాంత్, అవినాశ్‌రావు ఎంపికయ్యారు. శుక్రవారం నుంచి మొదలయ్యే టోర్నీలో వీరు ఇండియా ఏ, బీ, సీ, డీ జట్ల తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు..యువ క్రికెటర్లను ప్రత్యేకంగా అభినందించారు. మరోవైపు సయ్యద్‌ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో 19 వికెట్లతో సత్తాచాటిన యువ పేసర్ రవితేజతో పాటు మహిళల సీనియర్ టోర్నీలో 15 వికెట్లు తీసిన శ్రావణి భవిష్యత్‌లో ఇదే రీతిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

గాఫ్‌కు స్వియాటెక్ చెక్

కాన్‌కన్(మెక్సికో) : యుఎస్ ఓపెన్ చాంపియన్ కొకొ గాఫ్ డబ్ల్యుటీఏ ఫైనల్స్ టెన్నిస్ టోర్నీలో ఇగా స్వియాటెక్ చేతిలో ఓటమి చవిచూసింది. బుధవారం జరిగిన రౌండ్‌రాబిన్ పోరులో గాఫ్ రెండో సెట్‌లో నాలుగుసార్లు డబుల్‌ఫాల్ట్ చేసి పరాజయంపాలైంది. స్వియాటెక్ 6-0, 7-5 స్కోరుతో గాఫ్‌కు చెక్ పెట్టింది. రెండో సెట్‌లో 4-2 ఆధిక్యం సాధించిన గాఫ్ 5-4 వద్ద నాలుగుసార్లు డబుల్‌ఫాల్ట్ చేసి మూల్యం చెల్లించుకుంది. ఈ విజయంతో స్వియాటెక్ ముఖాముఖి పోరులో ఆధిక్యాన్ని 9-1కి పెంచుకుంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌లలో స్వియాటెక్ విజయాలు నమోదు చేసుకున్నది.

టీపీజీఎల్ సెమీస్‌లో వారియర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: శ్రీనిధి యూనివర్సిటీ తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్(టీపీజీఎల్) సీజన్-3లో ఆర్య వారియర్స్ టీమ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో ఆర్య వారియర్స్ 3.5-2.5 తేడాతో ఎమ్‌వైకే స్ట్రైకర్స్‌పై అద్భుత విజయం సాధించింది. వారియర్స్ తరఫున వికాస్‌రెడ్డి(1), వీరన్‌బాబు(0.5), ఫహీముద్దీన్(0.5) రాణించారు. మరో సెమీస్‌లో టీమ్ టీఆఫ్ 4-2తో లహరి లయన్స్‌పై గెలిచింది. ఈ నెల 5న ఆర్య వారియర్స్, టీమ్ టీఆఫ్ జట్ల మధ్య ఫైనల్ పోరు జరుగనుంది.

ఆధిక్యంలోకి విదిత్

ఐజిల్ ఆఫ్ మాన్ : ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతి ఏడో రౌండ్‌లో అద్భుత విజయంతో ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన జవొఖిర్ సిందరొవ్‌పై 57 ఎత్తులలో విజయం సాధించిన విదిత్ 5.5 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించే దిశగా విదిత్ అడుగులు వేస్తున్నాడు. కాగా తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి 5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఏడో రౌండ్‌లో ఇతర భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, అర్జున్, నిహాల్ సరిన్, హరికృష్ణ, ఆర్యన్ చోప్రా, గుకేష్ విజయాలు నమోదు చేసుకోగా, నారాయణన్, అరవింద్ చిదంబరం, రౌనక్ సాధ్వాని, మురళి కార్తికేయన్, అధిబన్ ఓటమిపాలయ్యారు. మహిళా విభాగంలో ఆర్.వైశాలి కజకస్థాన్‌కు చెందిన అసబయేవపై గెలుపొంది 5.5 పాయింట్లతో మరో ఇద్దరితో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నది.

టికెట్ల అమ్మకాలలో మా పాత్ర లేదు: గంగూలీ

కోల్‌కతా : భారత్-దక్షిణాఫ్రికా మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాలలో తమ పాత్ర ఎంత మాత్రం లేదని బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ వెల్లడించాడు. టికెట్లు అమ్మకాల గోల్‌మాల్‌లో తన సోదరుడు స్నేహశిష్ కుగానీ, తనకుగానీ ఎటువంటి పాత్ర లేదని, పోలీసులు దోషులను పట్టుకుంటారన్న నమ్మకముందన్నాడు. ఆదివారం జరిగే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు దొడ్డిదారిన అమ్ముకుంటున్నారని ఒక క్రికెట్ అభిమాని ఫిర్యాదు మేరకు మైదాన్ పోలీసు స్టేషన్ అధికారులు బుధవారం స్నేహశిష్‌కు నోటీసులు జారీచేశారు. ఆరోపణలపై గంగూలీ స్పందిస్తూ టికెట్ల అమ్మకాలలో తమ జోక్యం లేదని ఖండించాడు. ఈడెన్ గార్డెన్స్ స్టేడియం సామర్థ్యం 67,000 కాగా లక్షకుపైగా అభిమానులు టికెట్లు ఆశించారు. అతి తక్కువ ధర రూ.900 టికెట్లు బ్లాక్‌మార్కెట్లో రూ.5000 అమ్ముతుండడం అభిమానులు ఆగ్రహానికి ఆజ్యం పోసినట్టయింది. టికెట్ల అమ్మకాల గోల్‌మాల్‌పై అభిమానులు క్యాబ్ (క్రికెట్ అసోషియేషన్ ఆఫ్ బెంగాల్), బీసీసీఐ, ఆన్‌లైన్ టికెట్ల అమ్మకాల సంస్థ బుక్ మై షో పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోహ్లీ జన్మదిన వేడుకలు రద్దు

మ్యాచ్ రోజునే కోహ్లీ జన్మదినమైనందున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని క్యాబ్ రంగం సిద్ధం చేసుకుంది. అయితే ఇందుకు బీసీసీఐ ఆమోదం లభించనందున ఎలాంటి వేడుకలు నిర్వహించడం లేదని క్యాబ్ వెల్లడించింది.

నెదర్లాండ్స్ X అఫ్గానిస్థాన్

లక్నో: వన్డే ప్రపంచకప్‌లో ముగ్గురు మాజీ చాంపియన్లను మట్టికరిపించి పుల్ జోష్‌లో ఉన్న అఫ్గానిస్థాన్ శుక్రవారం నెదర్లాండ్స్‌తో అమీతుమీకి సిద్ధమైంది. ఇంగ్లండ్, పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లను అవలీలగా ఓడించిన అఫ్గానిస్థాన్.. అదే జోరులో నెదర్లాండ్స్‌ను చిత్తుచేయాలని చూస్తుంటే.. దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లపై సాధించిన విజయాల స్ఫూర్తిగా ముందుకు సాగాలని నెదర్లాండ్స్ యోచిస్తున్నది. మరి స్పిన్‌కు సహకరించనున్న లక్నో పిచ్‌పై రషీద్‌ఖాన్, ముజీబ్, నబితో కూడిన బౌలింగ్ దళాన్ని డచ్ జట్టు ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. రాహ్మానుల్లా, రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లాతో అఫ్గాన్ బ్యాటింగ్ కూడా బలంగా కనిపిస్తున్నది.

పూవమ్మ పునరాగమనం

న్యూఢిల్లీ : నిషేధిత ఉత్ప్రేరకాలు వినియోగ ఆరోపణలు ఎదుర్కొన్న ఆసియా క్రీడల పతక విజేత ఎంఆర్ పూవమ్మ తిరిగి రంగ ప్రవేశం చేసింది. 33 ఏళ్ల పూవమ్మ బుధవారం జాతీయ క్రీడల్లో కర్ణాటక తరఫున పాల్గొన్నది. 2014, 2018 ఆసియా క్రీడల్లో పూవమ్మ 400మీ., 4X400 రిలేలో పలు పతకాలు గెలుచుకున్నది. నిషేధంపై పూవమ్మ కేరళ హైకోర్టును ఆశ్రయించడంతో నిషేధం ఎప్పటినుంచి అమలు అవుతుందన్న విషయమై స్పష్టత ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఎట్టకేలకు శాంపిల్స్ సేకరించిన ఫిబ్రవరి 18, 2021నుంచి నిషేధం అమలులోకి వచ్చినట్టు, ప్రస్తుతం ఆమె నిషేధం తొలగినట్టు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వివరించింది. దీనితో పూవమ్మ జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశం లభించింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.